క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కౌతాళం:ఉరుకుంద క్షేత్రానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈరన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. వరుసగా సెలవు రోజులు కలిసి రావడంతో పాటు సోమవారం కూడా సెలవు రోజు ఉండడంతో భక్తులు అధికంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి,పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఫలపుష్పాలతో అలంకరించారు.అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

తుంగభద్ర నదికి వరద కాలువ నిర్మించండి

కౌతాళం: కౌతాళం మండలం చాల వెనుకబడిన ప్రాంతమని, ప్రతి ఏడాది అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు తీవ్ర నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య అన్నారు. తుంగభద్ర నదిపై వరద కాలువ లేదా రైట్ కెనాల్ నిర్మించాలని కోరుతూ సోమవారం టీడీపీ మండల నాయకుడు ఉలిగయ్యకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో తుంగభద్ర దిగువ కాలువ ప్రవహిస్తున్న రైతులకు ఉపయోగకరంగా లేదన్నారు. ప్రతి ఏడాది పత్తి, మిరప సాగు చేసిన రైతులు తెగుళ్ల వలన లేక వర్షాలు సరిగా లేక, పెట్టిన పెట్టుబడులు కూడ రాక నష్టపోతున్నారన్నారు. 10 ఎకరాలున్న రైతులు సైతం బెంగళూరు, బొంబాయి, గుంటూరు, తెలంగాణ ప్రాంతాలకు బతుకుదెరువు కోసం వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, రైతు సంఘం నాయకులు ఉలిగయ్య, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

గోవిందమ్మకు ఆర్థిక సాయం



గోవిందమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరురూరల్:ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దకబుడూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మకు చేయూత స్వచ్ఛంద సంస్థ రూ. 30 వేలు, నందవరం అంబేడ్కర్ యూత్ సభ్యులు రూ. 6,500 ఆర్థిక సాయాన్ని సోమ వారం అందజేశారు. చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రసన్నరాజు గోవిందమ్మను పరామర్శించి నగదును అందజేశారు. ఆమెపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.చేయూత సంస్థ సభ్యులు మాదన్న, ఆడివన్న భాస్కర్, హంపయ్య, అంబేద్కర్ యూత్ సభ్యులు ప్రకాష్, వినోద్‌కుమార్, రంగస్వామి, వినోద్, భరత్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



మాచాని సోమన్నను పరామర్శిస్తున్న బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణంలోని చేనేత వర్గానికి చెందిన మాచాని సోమన్నను సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టాశివనీలకంఠ, శాప్‌నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నాయకులు మహబూబ్‌బేగ్, కిరణ్, సోమేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ ఆధ్వర్యంలో సోమ వారం ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి బి.నాగరాజు, డాక్టర్ విశ్వనాథ్, పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున ప్రారంభించారు. మధు ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్లు విశ్వనాథ్, దేవన గౌడ్ పాల్గొని గుండె, ఎముకలు, కంటి సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 150 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు శిబిరంలో వైద్య పరీక్షలను చేయించుకున్నారు. ఎస్టీయూ నాయకులు రమేష్ నాయుడు, వీరచంద్ర యాదవ్, మహదేవప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆదోని పట్టణంలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



మహమ్మద్ ప్రవక్త వస్తువులను, తలనీలాలను తిలకిస్తున్న భక్తులు



నదికైరవాడిలో విద్యుత్ దీపాలంకరణలో మక్కా, మదీనా నమూనాల ఊరేగింపు



పెద్దతుంబళంలో మక్కా, మదీన నమూనాలను పుర వీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం



ఇస్విలో ర్యాలీ ప్రారంభిస్తున్న మత పెద్దలు

మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం

- భక్తిశ్రద్ధలతో మిలాద్- ఉన్-నబీ వేడుకలు
- ముస్లింల శాంతిర్యాలీ
- మహమ్మద్ ప్రవక్త తలనీలాలు, వస్తువుల ప్రదర్శన
- తిలకించి తరించిన ముస్లింలు

ఆదోని సెంట్రల్: సర్వమానవాళి కోసం మహమ్మద్ ప్రవక్త చేసిన బోధనలే స్ఫూర్తి దాయకమని, ఆయన మార్గాన్ని అనుసరించాలని ముస్లిం మత గురువులు పిలుపునిచ్చారు. మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో మిలాద్- ఉన్- నబీ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని దోల్‌షా పహేల్వాన్ మసీదు నుంచి షాహి జామియా మసీదు వరకు భారీ ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని కొడల్ పేట, నిర్మల్ టాకీస్ సమీపంలో ముక్తార్ అహ్మద్ సాహెబ్ ఇంటి వద్ద మహమ్మద్ ప్రవక్త వాడిన వస్తువులు, తలనీలాలను భక్తుల సందర్శనార్థం ఉంచారు. వాటిని తిలకించడానికి భక్తులు ఉదయం నుంచి బారులుదీరారు. ఎంతో పుణ్యం చేసి ఉంటే తప్ప ఈ వస్తువులను తిలకించే భాగ్యం దక్కదని వారు సంతోషం వ్యక్తం చేశారు. పండుగను పురస్కరించుకొని కొంత మంది భక్తులు ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఒకరి నొకరు ఆలింగనం చేసుకొని మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మత గురువులు మాట్లాడుతూ ప్రవక్త బోధించిన ప్రేమ, దయ, కరుణ దాతృత్వం వంటివి అనుసరించాల్సిన అవస్యకత ఉందన్నారు. సాధారణ జీవితం గడిపి సాటి వారికి ప్రేమ అనురాగాలను పంచి, సమాజంలో శాంతి స్థాపనకు మహమ్మద్ కృషి చేశారని గుర్తుచేశారు. అలాగే మండల పరిధిలోని పెద్దతుంబళం గ్రామంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మైనార్టీ గ్రామ పెద్దలు అన్వర్‌బాషా, జహీర్ అలీ అధ్వర్యంలో మదీనా మరియు మక్కా ప్రతిమలను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు.



ఎమ్మిగనూరు పట్టణంలో పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో మిలాద్ ఉన్-నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. జామీయా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో మసీదు నుంచి శాంతి ర్యాలీ చేపట్టి సోమప్ప సర్కిల్ మీదుగా తిరిగి జామీయ మసీదుకు చేరుకున్నారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు ఖాశింబేగ్, ముస్లిం పెద్దలు అల్లావుద్దీన్, ఉమర్ సాబ్, కె.బాషా , రసూల్, మాబ్బాష , సాబిర్, ఉమ్మర్, కౌన్సిలర్ వాహిద్ పాల్గొన్నారు.

సాటి మనిషికి సాయపడాలి

ఆదోని రూరల్: ప్రతిఒక్కరూ సేవాభావంతో మెలగాలని, సాటి మనిషికి సాయపడాలని ముస్లిం మత పెద్దలు పిలుపునిచ్చారు. మండలంలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ పండగను జరుపుకున్నారు. మండలంలోని ఇస్వీ, మదిరె, హానవాల్, కడితోట, పెద్దహరివాణం, పెద్దతుంబళం , సంతెకూడ్లూరు, సాంబగల్లు, పెద్దపెండేకల్ తదితర గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా మసీదులు, దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కోసిగి: స్థానిక కటికె వీధి, నూరాని సున్నీ మజీద్, మదినా, మస్జీద్ ఏ అక్సా, మస్జీద్ ఏ అన్వరుల్లా ఫారుఖీ మసీద్‌లలో మైనార్టీ కాలలలో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబి వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మజీద్‌లను విద్యుద్దీపాలతో, జెండాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంకాలం కటికె వీధి నుంచి గోఖర్ జెండాను పురవీధుల గుండా ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. కటికె వీధి, మైనార్టీ కాలనీల్లో, సాతనూరులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గోనెగండ్ల : మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలను మండల కేంద్రం గోనెగండ్లతో పాటు హెచ్. కై రవాడి, పెద్దనేలటూరు, గంజిహళ్లి, పెద్దమరివీడు, కులుమాల, చిన్నమరివీడు, బైలుప్పల, అగ్రహారం, ఐరన్‌బండ తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గాలు, మసీదులలో ప్రత్యేక ఫాలహాలు నిర్వహించారు. స్థానిక సంతమార్కెట్ సమీపంలో మౌలాలి కట్ట దగ్గర నుంచి జెండాను వైఎస్సార్ సర్కిల్ వరకు ఊరేగించారు. సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెద్దకడబూరు : మండలంలో అన్ని గ్రామాల్లో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మసీద్‌లలో ప్రార్థనలు గావించి జెండాలు చేతబూని ప్రధాన రహదారుల్లో భారీ శాంతిర్యాలీ చేపట్టారు. పెద్దకడబూరు మండల కేంద్రంలో మత గురువు అబ్దుల్ రహమాన్ ప్రవక్త జీవిత విశేషాలను, బోధనలను వినిపించారు.

నందవరం : మండలం కేంద్రంతో పాటు నాగలదిన్నె, హాలహర్వి, నదికైరవాడి, మాచాపురం, కనకవీడు గ్రామాలలో మిలాద్ -ఉన్-నబీ వేడుకలు ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మసీదు నుంచి ఆయా వీధుల గుండా ఆయా గ్రామాలలో జెండాలు పట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. మక్కా, మదీనాల నమూనాలను ఊరేగించారు. మత పెద్దలు నజీర్ అహమ్మద్, యూసుఫ్, హుసేన్‌సాబ్, చాంద్‌బాషా, మహబుబ్ బాషా మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చాంద్‌బాషా, మహబూబ్ బాషా, షేక్ అహమ్మద్, అత్తవుల్లా, షర్ఫుద్దీన్, మాభాష, షేక్షావలి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్‌ప్రవక్త చూపిన మార్గమే సరైనది

కౌతాళం: మహమ్మద్‌ప్రవక్త చూపిన మార్గమే సరైనదని జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ అన్నారు. సోమవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను మండల కేంద్రమైన కౌతాళంతో పాటు కామవరం, చిరుతాపల్లి,చూడి, హల్వీ, నదిచాగి, ఉప్పరహల్, కుంటనహల్, బదినేహల్, గుడికంబాలి గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆయా జామీయ మసీదుల్లో భోజన వసతి కల్పించారు. సాయంత్రం ముస్లిం సోదరులు గ్రామాలలోని ప్రధాన విదుల గుండా ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. కౌతాళంలో ఆసరే ముబారక్ (ప్రవక్త కేశాల) ప్రదర్శనను ఖాదర్‌లింగ స్వామి దర్గాలో దర్గా ధర్మకర్త మున్నపాషా వుసేని చీష్తీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో గుల్షన్ కమిటీ అధ్యక్షుడు మున్నపాషా, గ్రామ పెద్దలు సయ్యద్ దూద్‌బాషా, టైలర్‌బాషా, మహబూబ్, యాలీ ఖాసీం, ధనిఫ్ పాల్గొన్నారు.



ఖాదర్ లింగస్వామి దర్గాలో మహమ్మద్ ప్రవక్త కేశాలను చూపుతున్న ధర్మకర్త మున్నపాషా చిష్తీ



కొడలపేటలో మహమ్మద్ ప్రవక్త తలనీలాలను దర్శించుకుంటున్న ముస్లింలు

ఆదోని రూరల్: కొడలపేటలోని బదర్ గుల్షన్‌లో మహమ్మద్ ప్రవక్త తలనీలాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తలనీలాలను దర్శించుకున్నారు.



గోనెగండ్లలో జెండాను ఊరేగిస్తున్న ముస్లింలు



కౌతాళంలో జెండాలతో ఊరేగింపు



కౌతాళంలో మదీనా నమునా ఊరేగింపు



కోసిగిలో గోఖర్ జెండాను ఊరేగిస్తున్న ముస్లింలు



పెద్దకడబూరులో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

మన్నించు గణేశా

- ఎల్‌ఎల్‌సీ కాలువలో పూర్తిగా మునగని గణనాథుడి ప్రతిమలు
- నీటిపై తేలుతూ దర్శనమిస్తున్న వైనం
- పట్టించుకోని ఉత్సవ కమిటీ, రెవెన్యూ అధికారులు
- దెబ్బతింటున్న భక్తుల మనోభావాలు



చిన్నహరివాణం వద్ద ఎల్లెల్సీ కాలువలో తేలుతున్న గణనాథులు

ఆదోని అర్బన్: మొట్టమొదటిగా పూజలందుకుంటున్న గణనాథునికి కష్టాలు వచ్చాయి. ఐదు రోజులపాటు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి భక్తులు ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఐదవ రోజు బుధవారం గణనాథుడి ప్రతిమలను పురవీధుల గుండా వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. అయితే గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రణాళిక లేకుండా నిమజ్జనం నిర్వహించడం, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యహించడంతో చిన్నహరివాణం ఎల్‌ఎల్‌సీ కాలువలో నిమజ్జనం చేసిన గణనాథులు తేలుతున్నాయి. దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. దీంతో గణేష్ ఉత్సవ కమిటీ వారిపై, రెవెన్యూ అధికారులపై భక్తులు మండి పడుతున్నారు.

ప్రణాళిక లేకపోవడం వల్లే

ఆదోని నియోజకవర్గంలో దాదాపు 450కు పైగా గణేష్ ప్రతిమలు గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండపాల్లో ప్రతిష్టించారు. అయితే కమిటీ సభ్యుల ప్రణాళికలు లేకుండా సరైన సమయానికి విగ్రహాలు తీసుకెళ్లేలా, ఘాట్‌లో నిమజ్జనం ఎలా చేయాలో సూచనలివ్వకుండా నిర్లక్ష్యంగా వల్లనే గణనాథులు ఎల్‌ఎల్‌సీ కాలువలో తేలుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే రెవెన్యూ అధికారులు కూడా గణనాథులు తేలిపోకుండా తగిన చర్యలు, సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణానికి హాని

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎంతో హానీ కలుగుతుందని ప్రముఖులు, మేధావులు చెబుతూనే ఉన్నారు. అయితే గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మండపాల నిర్వాహకులకు మట్టి విగ్రహాల ఏర్పాటుపై అవగాహన కలిగించకుండా పోవడం వల్ల భారీ వినాయకులు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసి ప్రతిష్టించారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ నీటిలో అంత సులువుగా కరగదు. దీంతో అవి నీటిపై తేలియాడుతూ దర్శనమిస్తున్నాయి. అంతే కాకుండా నీరు కూడా కలుషితమవుతుంది. ఆనీటిని తాగే పశువులకు, మనుషులకు, పంటలకు ఎంతో హానీ కలుగుతుంది. మట్టి వినాయకులైతే నీళ్లల్లో నిమజ్జనం చేసిన వెంటనే కరిగిపోతాయి. దీంతో నీరు కలుషితంకాకుండా, ఎవరికి ఎలాంటి హాని ఉండదు.

నిమజ్జనోత్సవం అయిన వెంటనే చర్యలు తీసుకోవాలి

ఐదు రోజులపాటు పూజలు చేసిన అనంతరం నిమజ్జన ఉత్సవంలో గణనాథ ప్రతిమలను కాలువలో నిమజ్జనం చేసిన మరుసటి రోజు గణేష్ ఉత్సవ కమిటీ వారు, రెవెన్యూ అధికారులు తేలిన గణనాథులను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలి. అయితే కొన్ని సంవత్సరాలుగా ఇలాంటి పరిస్థితులు పునరావృతమవుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఇకనైనా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు నిమజ్జనాన్ని ప్రణాళికబద్ధంగా నిర్వహించి, గణనాథులు ఎల్‌ఎల్‌సీ కాలువలో తేలకుండా నీరు కలుషితంగాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, భక్తులు, ప్రముఖులు, మేధావులు కోరుతున్నారు.

మనోభావాలు దెబ్బతింటాయి



మొట్టమొదట పూజలు అందుకునే గణనాథుడికి ఎల్‌ఎల్‌సీ కాలువలో ఇలా తేలుతూ ఉండటం వల్ల హిందువుల మనోభావాలు దెబ్బతింటాయి. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు ఎల్‌ఎల్‌సీ కాలువలో గణనాథులు తేలడంపై చర్యలు తీసుకోవాలి. మరోసారి జరగకుండా ప్రణాళికలు చేపట్టాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ నీటిలో వేయడం వల్ల నీరు కలుషితమై మనుషులు, పశువులు రోగాలబారిన పడే అవకాశం ఉంది.

– గోవర్ధన్, పెద్దహరివాణం

ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌ను నిషేధించాలి



వినాయక చవితి రోజున ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో చేసిన గణనాథులను తయారు చేయకుండా, ప్రతిష్టించకుండా అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలి. లేదంటే నీటిలో కరగకుండా ఇలా గణనాథులు తేలడంతో భక్తుల మనోభావాలు దెబ్బతీయడమేగాకుండా చాలా బాధగా ఉంటుంది. ఇప్పటికైనా సభ్యులు, అధికారులు విగ్రహాలు నీటిలో మునిగేలా చర్యలు తీసుకోవాలి.

– కన్నె జగదీష్, ఆదోని మండలం

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దకడబూరు : ఈ నెల 17, 18, 19, 20వ తేదీ లలో జరిగే పాఠశాల వంట ఏజెన్సీ శిక్షణా కార్యక్రమాలను మండలంలోని డొక్కా సీతమ్మ వంట ఏజెన్సీ వారు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి రామమూర్తి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు జరిగే శిక్షణా కార్యక్రమాలు మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఉంటాయన్నారు. ఒక్కరోజు మండలంలోని 10పాఠశాలల వంట ఏజెన్సీలు పాల్గొనాల్సి ఉంటుందన్నారు. శిక్షణకు వంట ఏజెన్సీలు హాజరయ్యేవిధంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దు

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బాలరాజు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు నిరసనగా సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఆయన మాట్లాడుతూ మూడవ సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు యత్నిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరే స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గడానికి కారణమన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు బాబు, చంద్రగౌడ్, ఉరుకుంద, రామదాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుకు గడువు పొడిగింపు

ఎమ్మిగనూరురూరల్: పంటలు, ఈ-కేవైసీ నమోదుకు ఈనెల 23 వరకు గడువు పొడిగించినట్లు ఏడీఏ మహమ్మద్ ఖాద్రి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో పంటల నమోదు 98 శాతం, ఈ-కేవైసీ 73 శాతం పూర్తి అయిందని చెప్పారు. డివిజన్ పరిధిలోని రైతులు ఇప్పటి వరకు పంటల నమోదు, ఈ కేవైసీ చేయించుకోనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీతారాం ఏచూరికి నివాళి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం డీవైఎస్ఐ ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ పూల మాల వేసిన నివాళులర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మహేష్, సురేష్, అజిత్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మసీదుకు రూ.2లక్షల విరాళం



కమిటీ సభ్యులకు నగదును అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: నదిచాగి సర్పంచ్ మహేష్ మిలాద్-ఉన్-నబీ పండుగను పురస్కరించుకుని గ్రామంలోని జామియా మసీదు అభివృద్ధికి రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. 2021 సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు దారునిగా పోటీలో నిలబడిన మహేష్‌కు ముస్లింలు మద్దతుగా నిలిచి గెలుపులో కీలకంగా వ్యవహరించారు. దీంతో మసీదు అభివృద్ధికి నగదును అందజేస్తానని అప్పట్లో సర్పంచ్ మాట ఇచ్చారు. ఈ మేరకు సోమవారం రూ.2 లక్షల నగదును సర్పంచ్ సోదరుడు మారెప్ప మసీదులో కమిటీ పెద్దలు ఖాసీం, మిల్లిజిలాన్, ఉసేన్‌బాషా, అలిసాబ్, మౌలాసాబ్, నజీర్, ముల్లా ఆలంబాషాలకు అందజేశారు.

ఎస్టీ జాబితాలో చేర్పించండి



బైక్‌ర్యాలీ చేస్తున్న వాల్మీకులు

కౌతాళం: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సమితి (ఏపీవీబీఎస్) జిల్లా అధ్యక్షుడు అర్జున్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కౌతాళంలో సోమవారం ఏపీవీబీఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టి, వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీ సాధన కోసం ఈనెల 22న జిల్లా కేంద్రం కర్నూలులో చర్చా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి వాల్మీకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సక్రితిక్కయ్య, రామాంజి, గోట్టయ్య, అద్దాల శ్రీరాము, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

ప్లాటినం జూబ్లీ వేడుకలకు ఎంజీ బ్రదర్స్ చేయూత



నిర్వాహకులకు రూ.2లక్షల చెక్కు ఇస్తున్న మాచాని రఘునాథ్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్లాటినం జూబ్లీ వేడుకల నిర్వహణకు ఎంజీ బ్రదర్స్ తరపున రూ.2లక్షల విరాళాన్ని మాచాని రఘునాథ్ సోమవా రం నిర్వాహకులకు అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభివృద్ధికి పూర్వవిద్యార్థులు కృషి చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి జవహర్ నవోదయలో కళా ఉత్సవాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 17, 18వ తేదీల్లో క్లస్టర్‌స్థాయి కళా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్‌లోని 16 జవహర్ నవోదయ విద్యాల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. క్లస్టర్ స్థాయి పోటీల్లో 9వ తరగతి, ఇంటర్ విద్యార్థుల మధ్య పోటీ నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు.